అల్లోల అలజడి!





• ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన బోర్డు (ఫైల్)

- వేడెక్కిన పామాయిల్ రాజకీయం
- నేడు భారీ ధర్నాకు రంగం సిద్ధం
- పెద్దసంఖ్యలో తరలిరానున్న రైతులు
- ఇక ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణ షురూ..

నిర్మల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అలజడి మళ్లీ మొదలైంది. కొద్దిరోజుల నుంచి స్తబ్ధుగా ఉన్న ఆయన మళ్లీ తన రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శిస్తుండడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. బీఆర్ఎస్ పార్టీలో పదేళ్ల పాటు మంత్రిగా కొనసాగిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎన్నికల్లో ఓటమి అనంతరం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినప్పటికీ ఆయన పార్టీ కార్యకలాపాలకు, ఆ పార్టీ సీనియర్ నాయకులకు దూరంగానే ఉంటున్నారు. మంత్రిగానే ఉన్న ఆయన హయాంలో శంకుస్థాపన జరిగిన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల ప్రారంభం అస్త్రంగా ఇంద్రకరణ్‌రెడ్డి మరో పొలిటికల్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టబోతున్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను బీజేపీకి చెందిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అడ్డుకుంటున్నట్లు ఇంద్రకరణ్‌రెడ్డి ఇటీవల చేసిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్న సంగతి తెలిసిందే. మహేశ్వర్‌రెడ్డి కమిషన్‌ల కోసమే ఫ్యాక్టరీ నిర్మాణ పనులను సాంకేతిక కారణాలు ఎత్తిచూపుతూ అడ్డుకుంటున్నారంటూ ఇంద్రకరణ్ రెడ్డి చేసిన బహిరంగ ఆరోపణలు క్రమంగా రాజకీయ చిచ్చు రగులుస్తున్నాయి. ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపణలను ఆదివారం మహేశ్వర్‌రెడ్డి ఖండించడమే కాకుండా ఆయనపై ఎదురుదాడి మొదలుపెట్టారు. కాగా ఇప్పటికే ఇంద్రకరణ్ రెడ్డి పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో సోమవారం భారీ ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన డిమాండ్ చేశారు.

భారీ ధర్నాకు రంగం సిద్ధం

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వైఖరిని నిరసిస్తుండడమే కాకుండా పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలంటూ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం చేపడుతున్న ధర్నాపైనే రాజకీయ విశ్లేషకుల దృష్టి కేంద్రీకృతమవుతోంది. ఈ ధర్నాకు పెద్దసంఖ్యలో రైతులను అలాగే తన అనుచరులు, పార్టీ కార్యకర్తలను రప్పించేందు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. గత రెండు రోజుల నుంచి ఇంద్రకరణ్ రెడ్డి అనుచరులు గ్రామాల్లో పర్యటిస్తూ ధర్నా కార్యక్రమానికి తరలిరావాల్సిందిగా రైతులను కోరుతున్నారు. దీంతోపాటు ఇంద్రకరణ్ రెడ్డి పేరిట జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలోనే కాకుండా మండల కేంద్రాల్లో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. ఇంద్రకరణ్ రెడ్డి మరోసారి తన బలాన్ని నిరూపించుకొని రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు సిద్ధమవుతుండడం చర్చనీయాంశంగా మారుతోంది.

ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు సైతం ధర్నాకు పెద్ద సంఖ్యలో రైతులను సమీకరించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగానే ఈ ధర్నాకు సంబంధించి నిర్మల్ నియోజకవర్గంలోని ఆయన అనుచరులంతా పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతున్నారు. పామాయిల్ రైతులతో పాటు ఇంద్రకరణ్ రెడ్డి అనుచరులను అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సైతం ఈ ధర్నాకు తరలించనున్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు ఈ ధర్నా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో భారీ ఫ్లెక్సీ బ్యానర్‌లను ఏర్పాటు చేసి రైతులను ధర్నాకు రప్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి.

మరో పొలిటికల్ ఇన్నింగ్స్

జిల్లాలో రాజకీయ దురంధరుడిగా పేరున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పామాయిల్ ఫ్యాక్టరీ ధర్నాతో మరో ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నారంటున్నారు. మూడు శాఖలకు మంత్రిగా బీఆర్ఎస్ పార్టీ హయాంలో కొనసాగిన ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి బహిరంగ కార్యకలాపాలకు దూరమయ్యారు. కేవలం పార్టీ సీనియర్ నేతల సమావేశాలకు మాత్రమే హాజరవుతూ ఆ తర్వాత పరామర్శలు, పలకరింపులకే ఆయన పరిమితమవుతూ వస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుంటూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపణలు చేశారు. అప్పటినుంచి ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఇక ప్రత్యక్ష ఎదురుదాడికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిపైనా ఘాటుగా విమర్శలు చేసి దుమారం రేపారు. మహేశ్వర్‌రెడ్డి కమిషన్‌ల కోసం కక్కుర్తి పడుతూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నాడని, అలాగే అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్నారని విమర్శనాస్త్రాలు సంధించారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులతోపాటు చెక్‌డ్యాంల నిర్మాణ పనులు, అమృత్ టూ పనులు లాంటి వాటిని అడ్డుకోవడం వెనక కమిషన్‌ల దందానే ఆధారపడి ఉందని ఇంద్రకరణ్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇలా మహేశ్వర్ రెడ్డిపై నేరుగా విమర్శలతో ఎదురుదాడి ప్రారంభించి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి రాజకీయంగా మరోసారి పావులు కదపడం మొదలుపెట్టిన వ్యవహారం జిల్లాలో చర్చకు తావిస్తోంది.

మహేశ్వర్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో..

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేసిన విమర్శలను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తిప్పి కొడుతూ ఎదురుదాడి మొదలుపెట్టడం రాజకీయంగా ప్రాధాన్యతకు కారణమవుతోంది. మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలకు ధీటైనా జవాబుధర్నా కార్యక్రమంతో ఇవ్వాలని ఇంద్రకరణ్‌రెడ్డి వర్గీయులు సిద్ధమవుతున్నారు. మూడు నెలల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపట్టకపోతే 10వేల మంది రైతులతో ధర్నా నిర్వహిస్తామంటూ మహేశ్వర్‌రెడ్డి చేసిన ప్రకటనను సైతం ఇంద్రకరణ్‌డ రెడ్డి సీరియస్‌గా తీసుకోనున్నారు. తన ధర్నాతో ఎమ్మెల్యే విమర్శలకు ఘాటైన సమాధానం ఇవ్వాలని ఇంద్రకరణ్‌రెడ్డి భావిస్తున్నారు. మొత్తానికి నిర్మల్ జిల్లాలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మధ్య విచిత్రమైన పొలిటికల్ వార్ నెలకొనడం అంతటా ఆసక్తికరంగా మారుతోంది.


సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

ఇంద్రకరణ్‌రెడ్డి మానసిక వైద్యుడి వద్దకు వెళ్లాలి

- మతిభ్రమించి నాపై ఆరోపణలు
- భూ కబ్జాదారుడు ఎవరో నిర్మల్ ప్రజలకు తెలుసు
- ఆయిల్ పామ్ రైతులకు అండగా ఉంటాం
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా వయోభారంతో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయన వెంటనే మానసిక వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని బీజేపీ శాసనసభ పక్షనేత, నిర్మల్ శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హితవుపలికారు. నిర్మల్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారని, ఉనికి కోసం ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని తాను నిర్మాణం కాకుండా ఆపుతున్నానని మాజీమంత్రి ఆరోపించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆయిల్‌పామ్ రైతులకు తాము అండగా ఉంటామని, మూడునెలల్లోగా ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిచేయకపోతే 10వేల మందితో ఆందోళన చేస్తామని ప్రకటించారు. పంట చివరిదాకా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒత్తిడిచేస్తామన్నారు. వయసు మీదపడ్డ అల్లోలకు మతిభ్రమించి మతిమరుపు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ యజమానులతో లాలూచీపడి ఆయన మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. జిల్లాలో భూ కబ్జాదారుడు ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. మాజీమంత్రి అల్లోల సోదరుడు దిలావర్‌పూర్‌లో పదేళ్లుగా ఎలాంటి అనుమతులూ లేకుండా క్రషర్ నడుపుతున్నారని ఆరోపించారు. రత్నాపూర్ కాండ్లిగ్రామంలో సహజసిద్ధంగా ఉన్న నాళాను పూడ్చి వెంచర్ వేసింది ఆయన కుటుంబ సభ్యులు కాదా అని ప్రశ్నించారు. సోఫీనగర్ ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేసి కమర్షియల్ జోన్‌గా మార్చింది ఆయన కాదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి ఆయన కుటుంబసభ్యులు డీ-1 పట్టాలకు సంబంధించి ఆర్జించిన అక్రమాస్తులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని, కేసు విచారణలో ఉందని చెప్పారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి కేటాయించిన భూములు ఇరిగేషన్‌శాఖ భూములుగా అధికారులు గుర్తించారని, జాయింట్ రిపోర్ట్‌లో ఇరిగేషన్ శాఖకు చెందిన భూమిగా తెలిన విషయం వాస్తవం కా దా అని ప్రశ్నించారు. మాజీమంత్రి తనభూముల విలువ పెంచుకునేందుకు ఆ భూమిని కేటాయించారని ఆరోపించారు. గతప్రభుత్వ హయాంలో ఇలాంటి ఫ్యాక్టరీ సిద్దిపేటలో ప్రభుత్వమే ఏర్పాటుచేసిందని ఇక్కడ మాత్రం మంత్రిగా ఉండి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రైవేట్ కంపెనీకి దారాదత్తం చేశారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, భూపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, తక్కల రమణరెడ్డి, సత్యం చంద్రకాంత్, సాధం అరవింద్, మార గంగారెడ్డి, నరేందర్, మాజీ ఉపసర్పంచ్ నర్సారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజావాణి యథాతథం : కలెక్టర్

నిర్మల్‌కల్చరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని యథాతథంగా నిర్వహించనుననట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చునని పేర్కొన్నారు.

16న వాలా సమావేశం

నిర్మల్‌కల్చరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న నిర్మల్ వాకింగ్ అండ్ లాఫింగ్ అసోసియేషన్ (వాలా) దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఆదివారం నిర్మల్‌లో 5కే రన్ డిగ్రీ కళాశాల నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు నిర్వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీతో వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సు

బాసర, మార్చి9 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలోని ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం (ఎన్ఐటీటీటీఆర్) చండీగఢ్‌తో కలిసి మార్చి 3 నుంచి 7 వరకు ఉచిత సిమ్యులేటర్‌లను ఉపయోగించి ఈసీఈ ల్యాబ్ సబ్జెక్టులను బోధించడం అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించడానికి విద్యాపాఠ్య కార్యకలాపాలలో ఉచిత సిమ్యులేటర్‌లను ప్రవేశపెట్టడం, అమలు ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈసీఈ విభాగం నుంచి 17 మంది ఫ్యాకల్టీ సభ్యులు, 8 మంది ల్యాబ్ సిబ్బంది హాజరై ఇంటర్ డిసిప్లినరీ సబ్జెక్టుల యొక్క వివిధ ల్యాబ్‌లకు సంబంధించిన అత్యాధునిక ఓపెన్-సోర్స్ సిమ్యులేటర్‌లను ప్రదర్శించడంపై దృష్టిసారించిందని పేర్కొన్నారు. ల్యాబ్‌లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ సర్క్యూట్ డిజైన్, డిజిటల్ ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లు మైక్రో ప్రాసెసర్‌లు, మైక్రో కంట్రోలర్‌లు, కమ్యూనికే షన్ ఇంజనీరింగ్, సిగ్నల్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ వంటి రంగాలలో సమగ్ర జ్ఞానాన్ని అందించింది. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీధర్శన్, ఏవో రణధీర్, ఎఫ్‌డీపీని సమన్వయకర్త డాక్టర్ నాగంజనేయులు, ల్యాబ్ అసిస్టెంట్ శ్రీకాంత్, అసోసియేట్ డీన్‌లు డాక్టర్ చంద్రశేఖర్ రావు, డాక్టర్ మహేష్, హెచ్‌వోడీ సాయి రాధా కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- భారీగా హాజరైన భక్తజనం


ఉత్సవ మూర్తిని శోభాయాత్రగా తీసుకెళ్తున్న దృశ్యం

భైంసా, మార్చి9 :పట్టణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక శ్రీమహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ పరిధిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రారంభమైన వేడుకలు గురువారం వరకు కొనసాగనున్నాయి. వేడుకలలో బాగంగా ఆదివారం ఆలయ ఆవరణలోని యాగశాలలో యాగాన్ని నిర్వహించారు. ఉదయం వేళలో ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, చతుస్థానార్చన, మూలమంత్రహవనములు, గరుడహోమం, ధ్వజారోహణము, సంతనార్థులకు గరుడ ప్రసాద కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. మధ్యాహ్నం వేళలో ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం వేళలో శ్రీవిష్ణు సహస్ర నామపారాయణం, నిత్య హవనములు, భేరి పూజ, దేవతాహవనములు, నిత్యహవనం, భేరిపూజ, దేవతాహ్వానం, నివేదన కార్యక్రమాలు జరిగాయి. వేడుకలకు పట్టణంలోని వివిధ కాలనీల భక్తులే కాకుండా సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. కళశస్థాపన మహోత్సవానికి మహిళాభక్తులు అధిక సంఖ్యలో హజరయ్యారు. వేడుకల్లో భాగంగా ఆలయప్రాంగణంలో రాత్రివేళల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరారించాయి.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఖానాపూర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): అనుమతుల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ వ్యక్తిపై ఖానాపూర్ పోలీసులు ఆదివారం కేసునమోదు చేశారు. ఖానాపూర్ ఎస్‌హెచ్‌వో రామచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఖానాపూర్ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. ఈసీజ్ చేసిన ఇసుకడంపులను స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో సదరు ఇసుకను శాంతినగర్‌కు చెందిన పానగంటి రాజేందర్ అనేవ్యక్తి దక్కించుకున్నాడు. కాగా శనివారం ఖానాపూర్ శివారులోని గాంధీనగర్ సమీపంలోగల రెంకోని వాగు నుంచి జేసీబీ ట్రాక్టర్ల సహాయంతో అక్రమంగా ఇసుకను తవ్వి సదరు వేలం పాటలో దక్కించుకున్న ఇసుక డంపులలో కలిపాడు. ఎలాంటి అనుమతి లేకుండా రెంకోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి తరలించినందున సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఖానాపూర్ ఎస్‌హెచ్‌వో రామచందర్ తెలిపారు. సదరు ఇసుకను అక్రమంగా తర లించేందుకు ఉపయోగించిన జేసీబీతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


పోలీసులు సీజ్ చేసిన జేసీబీ ఇదే..

పేదలపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యం సరికాదు

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్


రంగపేట కొత్తగూడలో మాట్లాడుతున్న సునారికారి రాజేష్

ఖానాపూర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో నిరుపేద కుటుంబాల గుడిసెలను అటవీశాఖ అధికారులు కూల్చడం సరికాదని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. ఆదివారం రంగపేట గ్రామంలోని కొత్తగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కొంతమంది నాయకులు ప్రోద్బలంతో అటవీశాఖ అధికారులు నిరుపేదలపై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. చదువురాని నిరుపేదలకు ఇంగ్లీష్‌లో రెండు నోటీసులు ఒకేసారి ఇచ్చి మోసం చేసి అధికారులు సంతకాలు పెట్టించుకున్నారన్నారు. నోటీసులకు సమాధానం ఇచ్చే సమయం కూడా ఇవ్వకుండా ఓ వ్యక్తికి సంబంధించిన గుడిసెను కూల్చడం ఎంతవరకు సమంజసమన్నారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా అధికారులు తమ తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో పేదప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు లింగన్న, స్వామి, శేఖర్, గంగన్న, రాములు, శంకరయ్య, భూమక్క, చంద్రకళ, సావిత్రి, లింగు, తదితరులు ఉన్నారు.


గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గజ్జెలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కుంటాల, మార్చి9: (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మండలం నలుమూలల నుంచి ప్రజలు అధికసంఖ్యలో హాజరై గజ్జలమ్మకు ప్రీతి పాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అడెల్లి పోచమ్మకు ప్రత్యేక పూజలు

సారంగాపూర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుండే కాకుండా మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులను మొక్కి పెరుగన్నంను నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి మొక్కులను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ ఇన్‌చార్జి ఈవో రమేష్‌తోపాటు ఆలయ సిబ్బంది అన్నిఏర్పాట్లు చేశారు. దీంతో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

- అడెల్లి పోచమ్మకు కాంగ్రెస్ నాయకుల పూజలు

మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ దేవాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్‌లతోపాటు నాయకులు, కార్యకర్తలు పూజలు చేసి మొక్కులను మొక్కారు. ఆలయ పూజారి అమ్మవారికి హారతి ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బందిని ఆలయం పునర్నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనను ఆలయసిబ్బంది శాలువాతో సన్మానించారు. ఆయనవెంట నాయకులు నర్సయ్య, నాయకులు ఉన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి

సోన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దుల కుంట గ్రామానికి చెందిన దేవోళ్ల శ్రీను (30) మాదాపూ ర్ గ్రామశివారులోని చెరువులోకి చేపలు పట్టేందుకు వె ళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువు నీటి లో పడి మృతిచెందాడు. మృ తుడి బావ ఇచ్చిన ఫిర్యాదుమేరకు సోన్ ఎస్సై గోపి కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


మృతుడి వివరాలను సేకరిస్తున్న పోలీసులు



చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

అంధకారంలో ఇచ్చోడ ఆర్టీసీ బస్టాండ్

● చీకటిమయంగా మారిన పరిసరాలు
● భయాందోళనకు గురవుతున్న ప్రయాణికులు

ఇచ్చోడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రవాణా దృష్ట్యా, ఆదాయం దృష్ట్యా మేజర్ ప్రయాణ ప్రాంగణం అయిన ఇచ్చోడ బస్టాండ్ అంధకారంలో మగ్గిపోతోంది. ఇటీవలే కాలంలో వినియోగంలోకి వచ్చిన ప్రయాణ ప్రాంగణంలో వెలుతురు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరంతరం అనేక బస్సులు ఆగుతున్నప్పటికీ ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండు అంధకారంలో కనిపించింది. అనేక బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులు ఈ చీకటితో భయందోళనకు గురవతున్నారు. బస్టాండు పరిసరాలు మొత్తం చీకటిమయం కావడంతో బస్సులు సైతం బస్టాండ్‌లోకి రాకపోవడమే గాకా.. బస్టాండు సమీపంలో ప్రయాణికులను దింపుతోంది. ఆదాయం ఉన్నా.. ఆర్టీసీకి వసతులు సైతం ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

తలమడుగు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో కజ్జర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, హాజరై పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలను మరింత అభివృద్ధి పరచాలని, ప్రభుత్వం దేవదాయ శాఖ నుంచి ప్రత్యేక నిధులతో అభివృద్ధి పరుస్తోందన్నారు. అదేవిధంగా ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సాకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొల్లారపు బాబన్న, గ్రామ పెద్ద చింతలపల్లి దేవారెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, జై భారత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఉడుగు గోదావరి, కమలాకర్, వెంకన్న యాదవ్, గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యాన మందిర వార్షికోత్సవం

తలమడుగు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ గ్రామంలో సిద్ధేశ్వర సంస్థాన్ పట్నాపూర్ ధ్యాన మందిర శాఖ కుచలాపూర్ 29వ వార్షికోత్సవాన్ని పులాజీబాబా భక్తులు, గ్రామస్థులు కలిసి ఘనంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం జెండాను ఆవిష్కరించి మహిళలు మంగళహారతులతో పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక ధ్యాన ధారణ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత బాబా గారికి హారతిని ఇచ్చారు. అనంతరం ఆదిలాబాద్ నుంచి వచ్చిన బాబా భక్తులు సతీష్ గురునులే, కమిటీ సభ్యులు షిండే రాములు మాట్లాడుతూ ధ్యానం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చునని, ధ్యానం సర్వరోగ నివారిణి అని అన్నారు. భగవంతుడు ఎక్కడో లేడని, ఆయన మనలోనే ఉన్నాడని ధ్యానం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొంది భగవంతున్ని మనలోనే పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, ధ్యాన మందిర కమిటీ అధ్యక్షుడు రవీందర్ పెట్కులే, లాల్గాడ ధ్యాన మందిర కమిటీ అధ్యక్షుడు నందీశ్వర్ నాగోషే విజయ్ వాడగురే, రమేష్ పెట్కులే, లక్ష్మీ మాందాడే, సునంద గురునూలే మహిళలు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

● బస్సులోని ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం



నుజునుజ్జు అయిన బస్సు ముందుభాగం



ఆగి ఉన్న ఐచర్ లారీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదిలా బాద్ రూరల్ మండలం జందాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఆగి ఉన్న ఐచర్ లారీని.. ఓ ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలు.. ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న ఒక కట్టెల లోడ్‌తో వెళుతున్న ఐచర్ వ్యాన్ టైర్‌పేలి డివైడర్‌ను ఢీకొట్టగా.. అక్కడే రోడ్డు పక్కన నిలిపివేశారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్ బజల్‌పూర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. వేగంగా దూసుకొచ్చి ఆగి ఉన్న ఐచర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ సమయంలో మధ్యప్రదేశ్‌కు చెందిన లోచన్ సాహు(32) బస్సును నడుపుతున్నాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.

కాగా పక్కనే నిద్రిస్తున్న ఛత్తీస్‌గడ్‌కు చెందిన ప్రదీప్ సాహు(35) కూడా ప్రాణాలు కోల్పోయాడు. కాగా ఈ బస్సులో 39 మంది ప్రయాణించగా.. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వెంటనే సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, డీఎస్పీ జీవన్‌రెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మిగతా ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడినట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



విరాళంగా ఇచ్చిన పరికరాలతో ఐటీ కంపెనీ ప్రతినిధులు

వికాసం పాఠశాలకు విరాళం

ఉట్నూర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొమురంభీం ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వికాసం ఆశ్రమ పాఠశాలను హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధులు ఆదివారం సందర్శించి విరాళం అందించారు. వికాసం బాధిరుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ ఐటీ కంపెనీ యోట టెక్‌ఫోర్స్ కొండాపూర్ కంపెనీ ప్రతినిధులు వికాసం పాఠశాల విద్యార్థుల కోసం వీఐ, హెచ్ఐ, ఎంఆర్, సీపీ, కేటగిరి విద్యార్థిని విద్యార్థులకు సంబంధించిన విద్యాబోధన పుస్తకాలు, క్రీడా సామగ్రి, మ్యూజిక్‌కి సంబంధించిన సుమారు రూ.2లక్షల విలువ గల సామగ్రిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ఆదరించి విద్యాబుద్ధులు నేర్పించడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీఈవో శ్రీనివాస్ అల్లాడి, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న గొడుగునా, ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ వికాస్, పీడీ కొట్నాక్ జల్పత్‌రావు, పాఠశాల సిబ్బంది, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ఇంద్రవెల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. ఆదివారం మండలంలోని ఏమ్మెయికుంట గ్రామంలో ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. టోర్నీలో గెలిచిన టీమ్‌కు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇందులో చింతావార్ దీపిక్, డాక్టర్ నవీన్ అగర్వాల్, మాజీ సర్పంచులు కోరెంగ సుంకట్ రావు, జాధవ్ లఖన్, ఎండీ జునైద్, ఈగల్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సారలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

తలమడుగు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామ దేవత సారలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గ్రామస్థులు, దాతల సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు నేరేళ్ల కళ్యాణ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జలాధివాసం, ధాన్య, పుష్ప, ఫల ఆదివాసాలను శాస్త్రోక్తంగా నిర్వహించి, ఆదివారం శాంతి యజ్ఞ యంత్రస్థాపన పూర్ణకుంభం కార్యక్రమాలతో విజయవంతంగా ప్రతిష్ఠాపన నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, క్రాంతి సారలమ్మ ఆలయ నిర్మాణానికి ముందుకు రావడంతో గ్రామస్థులు గ్రామపెద్దలు ఆయనను కుటుంబ సమేతంగా సన్మానించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాటిపెల్లి వసంతరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంటి, విజయ్, కొత్తపల్లి శ్రీనివాస్, జగదీష్, గ్రామపెద్దలు వసంత్‌రెడ్డి, పద్మాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



● తలమడుగులో నూతనంగా ప్రతిష్ఠించిన గ్రామ దేవత, సారలమ్మ విగ్రహాలు



శాంతి యజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితులు

విలీన విద్యా కేంద్రాలు.. అలంకారప్రాయమే!

(5వ పేజీ తరువాయి...)

ఇంకా విడుదల కాలేదని తెలుస్తుంది. విలీన విద్యా వనరుల కేంద్రాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు మూగ, మానసిక వైకల్యం, వినికిడి లోపం, ఆటిజంతో పాటు 21 రకాల వైకల్యాలు కలిగిన విద్యార్థుల అవసరాల కోసం కావాల్సిన పరికరాలను అందించాల్సి ఉంటుంది. ఈ చిన్నారులకు విద్యా బోధనతో పాటు విద్యార్థులకు పర్సనాలిటి అభివృద్ధి, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని భావించి ఏర్పాటు చేసిన ఈ విలీన విద్యా వనరుల కేంద్రాలలో ఇవేమీ అమలు కావడం లేదని తెలుస్తుంది.

చాలీచాలని వేతనాలు

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విద్యా ప్రగతి కోసం పని చేస్తున్న ఐఈఆర్‌పీలతో పాటు కేర్ టేకర్లు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా విధుల్లో చేరిన వారికి కేవలం నెలకు రూ.19 వేల వేతనం, కేర్ టేకర్లకు రూ.3500తో సరిపెడుతున్నారని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వస్తున్న కనీస వేతనాల నుంచి ఫోన్ బిల్లులు, రవాణా చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో విలీన విద్యా వనరుల కేంద్రాలలో కావాల్సిన అవసరాలను బట్టి ఐఈఆర్‌పీల సలహాలు తీసుకొని పరికరాలు కొనుగోలు చేసే సరఫరా చేయాలని, అధికారులు పనికిరాని పరికరాలు కొనుగోలు చేసి సరఫరా చేయవద్దని వారు అభిప్రాయపడుతున్నారు. ఇది కాకుండా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను పాఠశాలలకు తెచ్చే వారికి రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, స్టైఫండ్ కలుపుకొని ప్రతీనెలా ఒక్కో విద్యార్థికి సుమారు రూ.1260 ఇన్సెంటివ్‌లు చెల్లించాల్సి ఉంది. అయినా ఈ అలవెన్సులు రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆశయం నెరవేర్చేలా విలీన విద్యా వనరుల కేంద్రాలను తీర్చిదిద్దాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వాహనంలో అక్రమంగా గోవులను తరలిస్తున్న దృశ్యం

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

నేరడిగొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోల్‌మామడ టోల్ ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న గోవులను గోరక్షకులు మార్గమధ్యంలో ఆదివారం గుర్తించారు. ఈ మేరకు వారు పోలీసులకు సమాచారం అందజేశారు. గోరక్షకులు అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని వెంబడించి నిజామాబాద్ అర్సపల్లిలో పట్టుకున్నారు. ఈ ఘటనలో డ్రైవర్ పరారు కాగా, క్లీనర్‌ను పట్టుకుని పోలీసులకు అందజేసినట్లు గోరక్షకులు తెలిపారు. వారిలో సంతోష్ సింగ్, చేతన్, జితేందర్, తదితరులు తెలిపారు.

'నేతకాని మహార్లను గ్రూప్ 2లో చేర్చాలి'

ఉట్నూర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నేతకాని మహార్ కులస్థులను వర్గీకరణ సమయంలో గ్రూపు 2లో కలపాలని, లేనట్లయితే ఎస్టీలుగా గుర్తించాలని కోరుతూ ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నేతకాని మహార్ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నేతకాని మహార్ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి గంగేశ్ మాట్లాడుతూ శాంతియుత ధర్మపోరాట దీక్షను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హక్కుల కోసం ఏజెన్సీ దళితులు సంఘటితంగా పోరాడాలి అన్నారు. ఇందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దులే వెంకటేశ్, న్యాయ సలహాదారులు పసుల రాజలింగం, తదితరులున్నారు.



విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వేద పండితులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కుంటాల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కుంటాల పురాతన శ్రీకృష్ణ దేవాలయ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీకాంత రామానుజ దాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఉదయం అభిషేకం, శృంగార హారతి, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రము, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము, పారాయణం, అనంతరం రాధాకృష్ణుల కళ్యాణం, హారతి, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు దిలావర్‌పూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

దిలావర్‌పూర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీవో అరుణ కుమారి తెలిపారు. మండల పరిషత్ ప్రాంగణంలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేస్తారని చెప్పారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అంధకారంలో కార్మిక కుటుంబాలు

నిర్మల్ రూరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా ఆలయంలోని నివాస గృహాలకు కరెంట్ నిలిపివేయడంతో కార్మిక కుటుంబాలు అంధకారంలోనే గడపుతున్నాయి. కొంతకాలంగా సాయిబాబా మందిరంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు.. ఆలయానికి చెందిన నివాస గృహాలలో ఉంటున్నారు. అయితే 18నెలలుగా కరెంట్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేశారు. దీంతో కార్మికులు శనివారం రాత్రి నుంచి ఇబ్బంది పడుతున్నారు. గతంలో అయితే సాయిబాబా ఆలయ కమిటీవారే కరెంట్ బిల్లులు, తినడానికి బియ్యం, పప్పు వంటివి ఇచ్చేవారని కార్మికులు చెప్తున్నారు. చాలీచాలని జీతంతో కరెంట్ బిల్లును కట్టలేమని గంతోసే ఈవో, ఛైర్మన్ చెప్పినట్లు తెలిపారు. ఈ విషయమై ఆలయ ఈవోను 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఈ విషయమై గండి రామన్న సాయిబాబా ఆలయ చైర్మన్‌ను సంప్రదించగా ఆలయ ఈవోతో మాట్లాడి సమస్యను త్వరితగతంగా పరిష్కరిస్తానని తెలిపారు.



విద్యుత్ సరఫరా నిలిపేయడంతో బయట పిల్లలతో ఉన్న కుటుంబ సభ్యులు

మున్సిపాలిటీని కైవసం చేసుకునేలా ముందుకు సాగాలి

బీజేపీ శ్రేణులతో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



పాల్గొన్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీలు

భైంసా, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన విధానాలతో మున్సిపాలిటీని కైవసం చేసుకునే దిశగా ముందుకు సాగాలని భైంసా పట్టణ బీజేపీ శ్రేణులకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికల విజయోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ భైంసా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు, ప్రతినిధులు, ఎన్నికల ఇన్‌చార్జీలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కీలక భాగస్వామ్యాన్ని అందించారని కొనియాడారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల ప్రచార పర్వాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టారని పేర్కొన్నారు. తాను ముథోల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తదుపరి జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ఇక్కడి ప్రాంతంలో బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా పార్టీ అభ్యర్థి గెడం నగేష్ విజయం సాధించగా ఇందులో ముథోల్ నియోజకవర్గ పరిధి నుంచే అత్యధిక మెజార్టీ లభించిందన్నారు. ఇక ఇటీవల జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులు విజయబేరి మోగించారని వెల్లడించారు. ఇదే విజయ పరంపర స్ఫూర్తిని మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించి భైంసా బల్దియా కైవసం చేసుకుందామని ఆకాంక్షించారు. భైంసా పట్టణ బీజేపీ శ్రేణులు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాత్మక దోరణి విధానాలను, పకడ్బందీ చర్యలను, విస్తృత ప్రచార పర్వాన్ని మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రదర్శించి బల్దియాలో పాగా వేసేందుకు బీజేపీ శ్రేణులన్నీ ఇప్పటినుంచే కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. వ్యూహ, ప్రతివ్యూహాలకు పదును పెడుతూ మున్సిపల్ ఎన్నికల కోసం సన్నద్ధమవ్వాలని సూచించారు. ఇందులో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ కార్యదర్శి భూకిరణ్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జీలు బండారి దిలీప్, కాసరోళ్ల ప్రవీణ్ కుమార్, మున్సిపల్ మాజీ ఛైర్మెన్ బి. గంగాధర్,మిర్జాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ వడ్నపు శ్రీనివాస్, పార్టీ ప్రతినిధులు గౌతం పింగ్లే, రావుల పోశెట్టి, సోలంకే భీంరావ్, రావుల రాము, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

దిలావర్‌పూర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించిన మండలంలోని గుండంపల్లికి చెందిన విద్యార్థులు జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చారు. పోటీల్లో లక్ష్మణ్, అసాద్, చరణ్, లాస్య, సంజయ్, నైతిక్‌రెడ్డి, శ్రీలక్ష్మీ, సాత్విక్, సహజ, సోనశ్రీ, అక్షయ, శ్రీనిధి పాల్గొని ప్రతిభ కనబర్చి అసోసియేషన్ నుంచి బెల్ట్, సర్టిఫికెట్‌లను పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను, మాస్టర్ మనీషాను ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ శ్రావణ్ అభినందించారు.



బెల్ట్, సర్టిఫికెట్ అందు కుంటున్న విద్యార్థి

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఒకే వేదికపై 1994-95 బ్యాచ్ విద్యార్థులు



ఒక్కచోట చేరిన 1997-98 బ్యాచ్ విద్యార్థులు

నిర్మల్ అర్బన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జుమ్మె రాత్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత మిత్రులు అంతా ఒకే వేదికపై కలిసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యను అభ్యసించిన గురువులను సత్కరించి తమ గురు భక్తిని చాటుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరీ చేష్టలను గుర్తుచేసుకొని మురిసిపోయారు. అనంతరం తమ కుటుంబ సంక్షేమాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ తామంతా ఒకేచోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

నర్సాపూర్(జి)లో..

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 27సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, మెమొంటోలు అందజేశారు. రోజంతా సందడిగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం చిన్నారెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు గుల్ మొహమ్మద్ ఖాన్, పున్నం చందు, మహేష్ గౌడ్, మహేందర్, డీలర్ సాయన్న, రాజలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నిర్మల్‌రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్యాల గ్రామం నుంచి గాంధీనగర్ వరకు రూ.25కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్యాల గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని, గ్రామ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ రోడ్డు నిర్మాణం రెండు నెలల్లో పూర్తిచేసేలా అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని పలు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, జమాల్, భూపాల్ రెడ్డి, ముత్యం రెడ్డి, భూపతిరెడ్డి, అశ్వద్ధామ, రాజేశ్వర్, ముత్యం, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

'పంటలకు నీటి విడుదల చేయించండి'



శ్రీహరి రావుతో మాట్లాడుతున్న గ్రామస్థులు

నిర్మల్ కల్చరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): సరస్వతి కెనాల్, సదర్మాట్ ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేయించాలని కోరుతూ నిర్మల్ మండలం తల్వేద గ్రామస్థులు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును కోరారు. ఆదివారం తల్వేద గ్రామరైతులు ఆయనను కలిశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి విడుదల చేయిస్తానని శ్రీహరి రావు వారికి హామీ ఇచ్చారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

నిర్మల్‌రూరల్,మార్చి9 (ఆంధ్రజ్యోతి): పోలీసుల చొరవతో పదేళ్ల బాలుడు కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన బాలుడు తప్పిపోయి రూరల్ మండలంలోని రాణాపూర్ సమీపంలో శనివారం రాత్రి ఏడుస్తుండగా గమనించిన ఆర్టీసీ డ్రైవర్ సుభాష్ 100కు కాల్ చేయడంతో డ్యూటీలో ఉన్న పోలీసులు రాజ్‌కుమార్, జంగు వివరాలు తెలుసుకొని తల్లికి అప్పగించినట్లు తెలిపారు.



తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు


గౌరాపూర్ పగుళ్లు తేలిన సీసీ రోడ్డు

నాసిరకంగా సీసీ రోడ్లు

● నిర్మాణంపై పర్యవేక్షణ కరువు!
● క్యూరింగ్ చేయడంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం..!?

ఇంద్రవెల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో అంతర్గత మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇస్తానుసారంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాలలో సీసీ రోడ్లు వేసి క్యూరింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పది కాలాలపాటు ఉండాల్సిన సీసీ రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగానే ఉంటున్నాయని చర్చించుకుంటున్నారు. (ఎన్ఆర్ఈజీఎస్) ఉపాధి హామీ పథకం రెండు కోట్ల 90 లక్షల నిధుల ద్వారా సీసీ రోడ్లు వేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో కాంట్రాక్టర్లు నాణ్యతను పట్టించుకోకుండా హడావుడిగా సీసీ రోడ్ల పనులను చేసే చేతులు దులుపు కుంటుండగా, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. కాంట్రాక్టర్లు నాణ్యతను పట్టించుకోకుండా పనులు చేయడం ఆపై బిల్లులు పెట్టుకోవడం పరిపాటిగా మారింది. దీంతో ఈజీఎస్ నిధులతో వేస్తున్న సీసీ రోడ్లు మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. నెల రోజులైనా గడవక ముందే పగుళ్లు తేలుతున్నాయి. ఇటీవల మండలంలోని గౌరాపూర్ గ్రామంలో వేసిన సీసీ రోడ్లు. పది కాలాలపాటు నాణ్యతగా ఉండాల్సింది పోయి నెల గడవకముందే పగుళ్లు తేలింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, కేస్లాపూర్, ఇన్కర్ గూడ గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేసి క్యూరింగ్(వాటర్) పోయడం లేదని ప్రజలు తెలుపు తున్నారు. కనీసం సీసీ రోడ్లకు తీవీ రోజులు వాటర్ క్యూరింగ్ చేయాల్సి ఉండగా, ఒకటీ రెండు రోజులు చేసి ఆపై పట్టిం చుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో వేసిన కొద్ది రోజులకే సీసీ రోడ్లు ఎక్కడికక్కడ పగుళ్లు తేలుతున్నాయి. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముందే ఎండాకాలం కావడంతో క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడం వల్ల బీటలు వచ్చి, సీసీ రోడ్డుకు పగుళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు సీసీ రోడ్ల నిర్మాణాలపై పర్యవేక్షణ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

బాల్యం తొంగిచూసింది..
ఉత్సాహం ఉరకలేసింది!


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇచ్చోడ, మార్చి, 9 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని బోరిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం బోరిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 34 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న విద్యార్థులందరూ రోజంతా సరదాగా గడిపారు. చిన్నానాటి జ్ఞాపకాలు, కుటుంబం గురించి చర్చించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పెన్నులు, ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, విఠల్‌రావ్, భూమన్న, భోజన్న, భరత్‌కుమార్ జనార్ధన్‌రావ్, పూర్వ విద్యార్థులు కుంట ప్రవీణ్‌ండ్డి, కట్కం నారాయణ, లస్మన్న, నర్సింహారెడ్డి, గంగేశ్వర్, బ్రహ్మయ్య, జాకీర్, శశిరేఖ, నయనత, మమత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

బోథ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో చదివిన విద్యార్థులంతా ఆదివారం మండలంలోని ఓ ఫంక్షన్ హాల్ వేదికగా కలిశారు. 20 సంవత్సరాలకు మిత్రులు ఉపాధ్యాయులంతా ఒకే వేదికపై కలవడంతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఉపాధ్యాయులు సైతం తమ శిష్యులు వివిధ ఉద్యోగాలలో విస్థిరపడడంతో సంతోషం వ్యక్తపరిచారు. అయితే ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించారు. 20 ఏళ్లకు అందరం కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.


ఉపాధ్యాయులతో కలిసి ఉన్న పూర్వ విద్యార్థులు


ఎస్పీ వాహనాన్ని లాగుతున్న పోలీస్ సిబ్బంది


గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్ ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు

● జిల్లాపై తనదైన ముద్ర వేసుకున్న ఎస్పీ గౌస్ ఆలం ● ఆదివాసీలపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎస్పీ
● గజమాలలతో సత్కరించి, వాహనం లాగిన పోలీసులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బదిలీలు సర్వసాధారణమని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపీఎస్ తెలిపారు. బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదిలాబాద్ పోలీస్ సిబ్బంది ఆదివా రం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పాలికారు. జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను పూలతో అలం కరించిన పోలీసు వాహనంలో ఊరేగించారు. ఆ వాహనాన్ని పోలీస్ అధికారులు, సిబ్బంది తాడుతో మరీ లాగుతూ మరి ఊరేగింపు చేశారు. అంతకుముందు ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనం తరం సిబ్బంది గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చేసిన సేవలు మరువలేనివని సిబ్బందిని విడిచి పోవడం బాధాకరమని తెలిపారు. 14 నెలలపాటు చేసిన సేవలు జిల్లా పోలీసులతో తన అనుబంధాన్ని పంచుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసు సిబ్బందికి, డీపీవో సిబ్బందికి పోలీసు అధికారులకు తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, హసీబుల్ల, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్పీ కృషి ..

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపడంలో, గంజాయి మాదకద్రవ్యాలను నిర్మూలనలో ప్రత్యేకంగా కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కష్టపడుతూ పార్లమెంట్ ఎన్నికలు, గణపతి, దుర్గాదేవి రంజాన్ పండుగలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను చోటు చేసుకోకుండా పూర్తి చేశారు. విపత్తుల సమయంలో ఆపత్కాల సమయంలో జిల్లా స్థాయిలో మొదటిసారిగా 20 మంది పోలీసు సిబ్బందితో డిజాస్టర్ రెస్పాన్స్‌ను స్థాపించి తనదైన ముద్రను ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించారు. వరద లు, భూకంపాలు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్‌డీఆర్ఎఫ్ వచ్చే సమయంలో జిల్లాలో సత్వరమే స్పందించి ప్రాణ నష్టం ఆస్తి నష్టం సంభవించకుండా ఈ డీడీఆర్ఎఫ్ బృందం పనిచేస్తుం ది. సిబ్బందితో నిరంతరం సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేసి పట్ట ణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముం దస్తు చర్యలు చేపడుతూ సిబ్బందికి మార్గదర్శనం చేస్తూ ఉన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసిన సందర్భంగా జాతీయ ఎన్నికల సంఘం తరపున వచ్చిన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సి బ్బందికి మును పెన్నడూ లేనటువంటి సౌకర్యాలను కల్పిస్తూ సిబ్బంది పని తనాన్ని మెరుగు పరిచేలా తనదైన ముద్రను జిల్లాలో ఏర్పాటు చేశారు.

ఆదివాసులపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎస్పీ

ఆదివాసులకై ప్రత్యేకంగా మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సదుపాయాన్ని చేరువ చేశారు. శీతాకాల సమయంలో నిరుపేదలైన ఆదివాసులకు రెండు వేల బ్లాంకెట్లను పంపిణీ చేశారు. పోలీసులు మీ కోసంలో భాగంగా ఆదివాసీ యువత క్రీడాల్లో, చదువులో ఆసక్తిని పెంపొందించడానికి పుస్తకాలను, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసి ప్రత్యేకంగా జిల్లా వ్యాప్తంగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించి వారిలో ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు.


జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



రసాయనాలొద్దు.. సహజ రంగులే ముద్దు!

● మన ఆరోగ్యం మన చేతుల్లోనే.. ● ప్రకృతి సిద్ధమైన రంగులతో ఉత్తమం ● 14న హోలీ


మార్కెట్‌లో పొడి రంగులు


రంగులు ఆడుతున్న చిన్నారులు (ఫైల్)

ముథోల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : హోలీ.. రంగులతో కేరింతలు కొట్టే పండుగ.. చిన్నారులు మొదలుకొని పెద్దల వరకు అందరూ ఆనంద హోలీలో మునిగిపోతారు. అయితే రంగుల్లో ఉన్న రసాయనాలతో హాని దాగి ఉందన్న విషయం మర్చిపోవద్దు. అలాగని హోలీ ఆడవద్దని కాదు. మితమైన పొడి రంగును వినియోగిస్తే ఆరోగ్యానికి రక్ష. వాటిని కడుక్కోవడానికి తక్కువ నీరు సరిపోతుంది. అసలు రంగులో ఎలాంటి రసాయన మూలకాలు ఉంటాయి. వాటితో కలిగే ప్రమాదాలు ఏమిటి అనే విషయాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

రసాయనాలు కలిపిన రంగులతో ఆరోగ్యం దెబ్బ తింటుంది. హోలీ వేడుకల్లో యువత ఇష్టం వచ్చినట్టు రంగుని ఉపయోగించడంతో అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్న మంది చాలా ఉన్నారు. రంగుల భయంతో హోలీకి దూరంగా ఉండేవారు ఉన్నారంటే అతిశయోశక్తి కాదు. కాబట్టి పొడి రంగులను ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రకృతి సిద్ధమైన రంగులు ఉత్తమం..

గోరింటాకు నుంచి ఆకుపచ్చ రంగును, పసుపు రంగు, మందార పువ్వు నుంచి ఎరుపు రంగును, మోదుగ పువ్వు నుంచి గులాబీ రంగును తయారు చేస్తారు. వీటితో ఆరోగ్యపరంగా ఎలాంటి హానీ ఉండ దు. అయితే ఇలా రంగులను తయారు చేయాలంటే శ్రమతో కూడుకున్న పని. అన్నిచోట్ల దొరకవు. మార్కెట్‌లో కూడా ధరలు ఎక్కువ ఉంటాయి. వీటితో సంతోషకరమైన హోలీ నిర్వహించుకోవచ్చు. కానీ తక్కువ సమయంలో తక్కువ ధరలో రసాయనా లతో తయారయ్యే రంగులు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. చాలా మంది వాటిపై ఆసక్తి చూపుతు న్నారు. ఇవి కవిగేసుకుంటే అంత తేగ్గి వదలవు. వీటితో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి.

దీర్ఘకాలంలోనూ సమస్యలు..

రసాయనాలు కలిపిన రంగులను ఉపయోగించడం వలన వెంటనే కొన్ని రకాల సమస్యలు వస్తుండగా, దీర్ఘకాలకంలోను ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు అంటున్నారు. రసాయన రంగులతో చర్మంపై దురద, వాపు, స్వేద రంధ్రాల నుంచి నీరు కారడం వంటివి జరుగుతాయి. దీర్ఘకాలంలో క్యాన్సర్, ఆస్తమా, ఊపిరితిత్తులు దెబ్బతినడం, మూత్ర పిండాల సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. సహజ రంగులు వాడడం అందరికి శ్రేయస్కరం.

వీటిని త్వరగా కడిగేయవచ్చు..

సాధారణంగా ఎరుపు, గులాబీ రంగులు చాలా ఉత్తమం. మిగతా రంగులతో పోలిస్తే వీటిని సులువుగా కడిగేయవచ్చు. హోలీ వేడుకల్లో పొడి రంగులనే వాడాలి. తడి రంగుల జోలికి వెళ్లవద్దు. పొడి రంగులు ఉపయోగించే విషయంలో ఒక జాగ్రత్త పాటించాలి. రంగును ముక్కు ద్వారా పీల్చకుండా జాగ్రత్తలు పాటించాలి. ముక్కు ద్వారా పీల్చడంతో రంగు ముక్కు రంధ్రాల నుంచి ఊపిరితిత్తులకు పోయే ప్రమాదం ఉంటుంది. లోపలికి రంగు వెళ్తే తుమ్ములు రావడంతో పాటు ఛాతిలో నొప్పి వస్తుం ది. మూత్ర పిండాలు, ఊపిరితిత్తులుపై ప్రభావం చూపుతాయి. ఈ జాగ్రత్తలు తీసుకొని పొడి రంగు లను ఉపయోగించుకోవాలి. వీటిని కడుక్కోవడం చాలా సులభమే. తక్కువ నీరుతో శుభ్రం చేసు కోవచ్చు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

రంగులను పూసుకునే ముందు మాయిశ్చరైజర్ క్రీమ్, లేదా కొబ్బరి నూనె రాసుకోవాలి. తలకు నూనె రాసుకోవడం మంచిది. రంగులు కంట్లోకి, నోటిలోకి పోకుండాజాగ్రత్త పడాలి. రంగు పూసుకునే వెంటనే కడగడం మళ్లీ పూసుకొని కడుక్కోవడం చేయకూడదు. హోలీ ఆడాక స్నానం చేయలి. తరచూ కడగడంతో రసాయనాలు స్వేద రంధ్రాల ద్వారా లోపలికి వెళ్లి ప్రమాదం ఉంది. చర్మం పొడి బారి మంట వస్తుంది. ఎర్రగా మారి దురద పెడుతుంది. ఆయిల్ స్కిన్ వారి కంటే డ్రై స్కిన్ వారికి రంగులు సులువుగా చర్మ రంధ్రాల ద్వారా లోలికి వెళ్తుంది.

తడి రంగులో ఇంజన్ ఆయిల్..

తడి రంగుల తయారీలకు ఇంజన్ ఆయిల్‌లను కలుపుతారు. వీటిని ఉపయోగించడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఇంజన్ ఆయిల్ కలిసిన రంగులు నోట్లోకి వెళ్లి కడుపులో మంట వస్తుంది. భవిష్యత్తులో దీర్ఘ కాలిక రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. తడి రంగులు కడుక్కోవడం ఇబ్బందిగానే ఉంటుంది.


రంగుకు ఉపయోగించే మోదుగ పువ్వు

మొక్కల పెంపకం.. పర్యావరణానికి ఆభరణం



ఫొటో న్యూస్



పచ్చదనం పెంపొందించి గ్రామ వాసులకు ఆహ్లాదకర వాతావరణం అందించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వాలు అమలు చేసిన హరితహారం వంటి కార్యక్రమాలు కొన్ని గ్రామాల్లో అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయి. కజ్జర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఏపుగా పెరిగిన మొక్కలు చూడముచ్చటగా కనిపిస్తూ గ్రామానికి వచ్చేవారిని అమితంగా ఆకర్షిస్తున్నాయి. నాటిన మొక్కలను నిర్లక్ష్యంగా వదిలేయకుండా సంరక్షించడంతో కార్యాలయ ఆవరణ చిట్టడవిని తలపిస్తుండడం విశేషం.


● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



కజ్జర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న చెట్లు



andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.3 : కనిష్ఠం 15.7
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
సోమవారం 10 మార్చి 2025





● విద్యా వనరుల కేంద్రంలో విరిగిన టేబుల్స్, పరుపులు



● ఉట్నూర్‌లోని విలీన విద్యా వనరుల కేంద్రం



● పనికి రాకుండా ఉన్న ఆట వస్తువులు, ఉపయోగంలో లేని మజిల్స్ స్ట్రెంతెన్

విలీన విద్యా కేంద్రాలు.. అలంకారప్రాయమే!

- జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం విద్యా వనరుల కేంద్రాల ఏర్పాటు
- ఉత్తర్వులు ఉన్నా.. విడుదల కాని నిధులు
- కరువైన కనీస సౌకర్యాలు.. విద్యార్థుల ఇక్కట్లు
- అయినా పట్టించుకోని అధికారులు
- చాలీచాలని వేతనాలతో ఐఈఆర్‌పీల సతమతం
- దశాబ్దం క్రితం సరఫరా చేసిన ఫిజియోథెరపి పరికరాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 20కి పైగా విలీన విద్యా వనరుల కేంద్రాలు



ఉట్నూర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలీన విద్యా కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకా ఈ కేంద్రాలలో పని చేస్తున్న ఐఈఆర్‌పీలు సైతం చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్, జైనథ్, అలాగే కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జైనూర్, ఆసిఫాబాద్, సిర్పూర్(టి), కాగజ్‌నగర్, అలాగే మంచిర్యాల జిల్లాలో దండేపల్లి, తాండూర్, బెల్లంపల్ల మందమర్రి, కోటపల్లి, మరి అదేవిధంగా నిర్మల్ జిల్లాలో భైంసా, నిర్మల్, ఖానాపూర్, ముథోల్‌లలో ఏర్పాటు చేసిన విలీన విద్యా వనరుల కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు కావాల్సిన సౌకర్యాలు అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

కరువైన సౌకర్యాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలీన విద్యా వనరుల కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారుల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన విషయాలను అధికారులు విస్మరించారు. ఈ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రశాంత వాతావరణంలో చదివించాల్సి ఉండగా.. జిల్లాలోని ఈ కేంద్రాలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 20కి పైగా కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో కొన్నింటికి సొంత భవనాలు ఉండగా.. మిగత కేంద్రాలు ఆయా పాఠశాలల్లో అనుబంధ గదుల్లో కొనసాగడం గమనార్హం. దీంతో ఈ కేంద్రాలకు విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తుంది. ఇచ్చోడ మండల కేంద్రంలో దశాబ్దం క్రితం నిర్మించిన భవనంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉట్నూర్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఈ కేంద్రంలో కూడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నాయి. అంతేగాకుండా ఆడుకునేందుకు కూడా సౌకర్యాలు లేవని తెలుస్తుంది. ఉట్నూర్ మండలంలోని గంగన్నపేట పాఠశాలలో కొనసాగుతున్న భవిత కేంద్రంలో ఫిజియోథెరపి చేసేందుకు పరికరాలు లేకపోగా థెరపిస్టు సైతం లేరు.

చెడిపోయిన పరికరాలు

జిల్లాలోని విలీన విద్య వనరుల కేంద్రాలకు దశాబ్దం క్రితమే ఫిజియోథెరపి పరికరాలు పంపిణీ చేయగా.. అవి ప్రస్తుతం చెడిపోయాయి. వీటిల్లో మజిల్స్ స్ట్రెంతెన్ మిషన్, బల్లలు, పరుపులు, రీలింగ్స్, ఫిజియోథెరఫి బాల్స్ లాంటివి చెడిపోగా.. ఫర్నిచర్ కూడా అంతంతమాత్రంగానే కనిపిస్తోంది.

విడుదలైనా... రాని నిధులు

ఉమ్మడి జిల్లాలోని పలు విలీన విద్యా వనరుల కేంద్రాలకు సౌకర్యాలు కల్పించడానికి ఒక్కొక్క కేంద్రానికి రెండు లక్షల రూపాయల వంతున నిధులు విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా నిధులు

(తరువాయి 6వ పేజీలో...)

సత్వరమే వేతనాలు పెంచాలి

: కురిసింగ రమేష్, ఐఈఆర్‌పీ, ఉట్నూర్



పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుకూలంగా విలీన విద్యావనరుల కేంద్రాలలో పని చేస్తున్న ఐఆర్‌పీలకు వేతనాలు పెంచాలి. దశాబ్ద కాలంగా విధుల్లో చేరిన నాటి నుంచి కేవలం 19 వేల రూపాయల వేతనం అందిస్తున్నారు.

కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి

: ఆత్రం అర్జున్, ఐఈఆర్‌పీ, ఉట్నూర్



విలీన విద్యా వనరుల కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా విద్యార్థుల అవసరాల మేరకు సరిపడా ఫిజియోథెరపి పరికరాలను సైతం అందించాలి. ఐఈఆర్‌పీల సలహాలు తీసుకొని పరికరాలు కొనుగోలు చేయాలి.

విద్యార్థులకు కావల్సిన పరికరాలు అందించాలి

: రితేష్ రాథోడ్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు



విద్యహక్కు చట్టం ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన విలీన విద్యా వనరుల కేంద్రాలకు తక్షణమే అన్ని సౌకర్యాలు కల్పించాలి. అంతేకాకుండా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కావల్సిన పరికరాలను సైతం అందించాలి. దీంతో పాటు పిల్లలకు, తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన ప్రతినెలా ఇన్సెంటివ్‌లు ఇవ్వాలి. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అందులో పని చేస్తున్న రిసోర్స్‌పర్సన్‌లకు సైతం వేతనాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు

● జిల్లాపై తనదైన ముద్ర వేసుకున్న గౌస్ ఆలం ● ఆదివాసీలపై ప్రత్యేకశ్రద్ధ చూపిన ఎస్పీ ● గజమాలతో సత్కరించి, వాహనం లాగిన పోలీసులు

వివరాలు 7వ పేజీలో..





అంధకారంలో ఇచ్చోడ ఆర్టీసీ బస్టాండ్

● చీకటిమయమైన పరిసర ప్రాంతాలు ● భయాందోళనకు గురైనప్రయాణికులు

వివరాలు 6వ పేజీలో..



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ప్రపంచమంతా దేశం వైపు చూస్తోంది

ఆదిలాబాద్ రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తున్నదని.. హిందువుల లపై ప్రపంచమంతా చర్చ జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ కాలనీలో చేపట్టిన నూతన రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ ధర్మ రక్షణకు పాటుపడుతూ ప్రతిఒక్కరూ ఐక్యతగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మనవడు, మాజీ కార్పొరేటర్ తీగల సునరితరెడ్డి కుమారుడు కనిష్క రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆదివారం శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్‌లతో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి మృతి దురదృష్టకరమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



తీగల కృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేడు తాంసిలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాంసి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎట్టకేలకు శనగల కొనుగోలు కేంద్రానికి అధికారులు శ్రీకారం చుట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం 'శనగలు కొనుగోలు చేయండి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికార యంత్రాంగం సోమవారం నుంచి మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో శనగలను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభించబడుతుందని సొసైటీ సీఈవో కేశవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనగ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించడం పట్ల శనగ రైతులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై విచారణ పూర్తి

బోథ్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై విద్యార్థులు చేసిన ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఎంఈవో, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారికి ఎదురవుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు పాఠశాల గురించి పట్టించుకోడని, పైగా విద్యా బోధన సరిగా సాగడం లేదని విద్యార్థులు వివరించారు. అంతేగాక పాఠశాలలో ప్రత్యేక తరగతులు జరుగుతున్న సమయంలో బయటికి వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. దీంతో విచారణ సమయంలో అక్కడే ఉన్న ఎస్సై ఇబ్బందులు కలగకుండా నిఘా వేస్తామని తెలిపారు. కాగా విచారణ సమయంలో సహితం ప్రధానోపాధ్యాయుడు లేకపోవడంతో పాటు ఆయన పాఠశాల అలస్యంగా వచ్చినట్లు అధికారులు గుర్తించారు. నివేదికను జిల్లా అధికారులకు చేరిందని విచారణ అధికారులు తెలిపారు.

ఎంతో మంది జీవితాలను మార్చిన శబరి

● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ● కౌటా(బి)లో ఘనంగా శబరిమాత ఆలయ వార్షికోత్సవం ● పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తజనం



ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు



ఆలయంలో హోమగుండం వద్ద యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

బోథ్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చెడు దారిలో నడుస్తున్న మనుషులను మంచి దారిలో నడిపించిన శబరిమాత ఎంతోమంది జీవితాలను మార్చి వేసిందని నమ్ముకున్న భక్తులకు కొంగుబంగారమై దీవించిందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో జరిగిన శబరిమాత ఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శబరిమాత ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. సద్గురు శబరి మాత జీవిత చరిత్ర తెలిసిన వారికి ఆమె దేవత అని, తెలియని వారు దేవతగా భావించి పూజలు చేస్తున్నారన్నారు. గత 30ఏళ్ల నుంచి తాను శబరిమాత చూపించిన మార్గంలో నడుస్తున్నానని, ఎంతోమంది ఆమె చూపించిన మార్గంలో నడుస్తూ వారి జీవితాలలో మార్పు తెచ్చుకున్నారన్నారు. డీసీసీబీ చైర్మన్‌గా జిల్లా రైతాంగానికి అండగా ఉంటున్నామని, రైతులు ఏ కష్టం వచ్చినా బ్యాంకు ద్వారా రుణాలు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు ఆత్మహత్యలతో సమస్యకు పరిష్కారం లభించదని, ప్రతీ రైతు బ్యాంకు ద్వారా రుణం పొందేవిధంగా తనవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డితో పాటు మాజీ సొసైటీ చైర్మన్ అండ్ బాపురెడ్డి, పూజారి ఎడమల ధర్మారెడ్డి, మల్లెపూల రమేష్, గురుస్వామి, బద్దం ప్రభాకర్ రెడ్డితో పాటు నర్సింగ్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

● రెండవ రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగిన వేడుకలు

బోథ్: మండలంలోని కౌటబి గ్రామంలో శబరిమాత 13వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన ఆదివారం ఆశ్రమంలో హోమ గుండాన్ని నిర్వహించగా నలుగురు దంపతుల జంటలవారు యజ్ఞంలో పాల్గొన్నారు. అయితే సాంప్రదాయం ప్రకారం ఆశ్రమం తరఫున గ్రామ దేవతలన్నింటికీ నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో తేజపూర్ గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల చిన్నారి చేసిన భరతనాట్యం అందరిని ఆకట్టుకుంది. భారీ సంఖ్యలో పలు గ్రామానికి చెందిన భక్తులు పాల్గొని భజన కార్యక్రమాల నిర్వహించారు.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్	సహర్
సా.6.30	ఉ.5.05



అద్వితీయుడైన సృష్టికర్తను మనిషి తనకు మరియు యావత్ ప్రపంచానికి యజమాని అని, ఆరాధ్యుడని హృదపూర్వకంగా అంగీకరించాలి. దైవత్వానికి సంబంధించిన సకల గుణగణాలు, అధికారాలు సృష్టికర్తకే అని విశ్వసించాలి.

ఆటోల ఆగడాలకు పోలీసుల చెక్

● ముందు సీట్లు మధ్యలో ఉన్న మిర్రర్ తొలగింపు

బోథ్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆటోల డ్రైవర్లు కొంతమంది పోకిరి చేష్టలు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందుల గురి చేస్తున్నారంటూ ఫిర్యాదులు రావడం పోలీసుల దృష్టికి వచ్చింది అంతేకాకుండా ఇబ్బందికరంగా వాహనాలు నడుపుతుండడానికి గమనించిన స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదివారం దాదాపు 20 ఆటోలను పిలిపించి వాటి ముందు సీట్లను, అలాగే మధ్యలో ఉన్న అద్దాలను ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోలలో డ్రైవర్‌కు రెండు వైపులా సీట్లు ఉండటం వల్ల డ్రైవింగ్ సమయంలో ఇబ్బందులు తలెత్తి ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అందుకే ఈ చర్యలు చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు. అంతేగాక కొంతమంది ఆటోల డ్రైవర్లు మితిమీరిన వేగంతో ఆటోలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, మైనర్‌లు ఆటోలు నడిపిన డ్రైవింగ్ లైసెన్సు లేకున్నా, ఇన్సూరెన్స్ లేకున్నా కేసులు తప్పవని ఆయన వివరించారు. మరోవైపు డ్రైవర్ ముందు భాగంలో అద్దం ఏర్పాటు చేసుకొని వాటిలో నుంచి వెనుక సీట్లో ఉన్న ప్రయాణికులను గమనిస్తున్నారని, ముందువచ్చే వాహనాలను గమనించడం లేదని ఫిర్యాదులు రావడంతో వాటిని తొలగింపజేశారు. దీంతో ఆటోల ఆగడాలకు కళ్లెం వేసినట్లు అయ్యింది.



తొలగించిన ముందు సీట్లతో ఆటో యజమాని, ఎస్సై, పోలీసులు